సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం ¦ 12 ¦ ఆగస్టు ¦ 2024



మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్ డ్రా

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి.

-8లో



గోలీ గుడ్లు

పోషకాహారం పేరుతో గోలీ సైజులో ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-8లో

గరిష్టం/కనిష్టం
35.2/27.4

వాతావరణం

జిల్లాలో ఆదివారం 27.4 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మద్దెల సురేష్‌బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పీసీఐ ఎన్నికలు త్వరలో జరపాలని, మెడికల్ స్టోర్ పెట్టుకొనే వ్యక్తికి సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫార్మసీ యాక్ట్ 1948 సవరణ 19 ప్రకారం ప్రతీ మెడికల్ స్టోర్లో ఫార్మసిస్ట్ ఉండాలని, ఫార్మ్-డి వారికి క్లినికల్ ఫార్మసిస్ట్ గా గుర్తించిన ప్రభుత్వం పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ఉద్యోగాలు ఇవ్వాలని, డ్రగ్ ఇన్స్పెక్టర్ నోటిఫికేషన్ త్వరలో ఇవ్వాలని, ప్రతి మండలానికి ఒక ఫార్మసీ ఇన్స్పెక్టర్‌ను నియమించాలని కోరారు.

ముస్లిం, మైనార్టీల ఆస్తులను కాపాడుతాం



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్

ప్రొద్దుటూరు క్రైం: ముస్లిం మైనార్టీల ఆస్తులను తెలుగుదేశం ప్రభుత్వం కాపాడుతుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తెలిపారు. స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మంత్రి ఫరూఖ్‌ను సన్మానించారు. అనంతరం మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ పూర్వీకులు మసీదులకు ఇచ్చిన స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలాలను కాపాడటంతో పాటు ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు గుర్తింపు, సముచిత స్థానం దక్కిందని తెలిపారు. టీడీపీ నాయకులు సీఎం సురేష్‌నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ ముక్తియార్, నియోజక వర్గ పరిశీలకుడు ప్రసాద్, వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు బేపారీ జాకీర్, అహ్మద్, అంజుమన్ కమిటి కో ఆర్డినేటర్ బొల్లవరం మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్క్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

ఏఎఫ్‌యూ: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో (బీఆర్క్) 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బీఆర్క్-2024 ప్రవేశాల ఏపీ కన్వీనర్, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఇంటర్మీడియట్ లేదా డిప్లొమా పూర్తి చేసి నాటా (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్)లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 19లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో 44 సీట్లు, గుంటూరు ఏఎన్‌యూలో 44 సీట్లు, భీమవరం ఎం.ఆర్.కె. కళాశాలలో 15 సీట్లు, తిరుపతి చదలవాడ అరుణ కళాశాలలో 28 సీట్లు, కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 44 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

చేనేతల ఖ్యాతి దేశమంతా చాటుదాం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ అదితిసింగ్

కడప కల్చరల్: మన జిల్లాకు వరంగా నిలిచిన మాధవరం చేనేతల ఖ్యాతిని దేశమంతటా చాటేందుకు కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో జిల్లా హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ జి.నాగరాజారావు ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించడమే చేనేత కళాకారులను ఆదుకోవడమేనని, మన జిల్లా ప్రత్యేకతను చాటే వారసత్వ సంపద అయిన చేనేతలను కాపాడుకుందామని సూచించారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి, పర్యవేక్షకులు పి.మధుసూదన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్లు, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

చౌకబారుగా కొట్టేద్దాం!

- లైసెన్సు ఫీజు ఎగ్గొట్టేందుకు బార్ యాజమానుల సన్నాహాలు
- అధికారం మనదే అందరూ ఏకతాటిపై రావాలంటూ పిలుపు
- ప్రత్యేకంగా అంబేడ్కర్ సర్కిల్‌లో ఓ లాడ్జిలో సమావేశం





సాక్షి ప్రతినిధి, కడప: నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్ యాజమానులు సిండికేట్‌గా మారేందుకు పావులు కదుపుతున్నారు. తెలుగుతమ్ముళ్ల అండతో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నాలు షురూ చేశారు. తక్కువ ఫీజుతోనే బార్లను కొట్టేయడానికి 'అధికార'అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ విషయమై కడపలోని ఓ లాడ్జిలో బార్ యజమానులు సమావేశమైనట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. ఈ మేరకు బార్ లైసెన్సు ఫీజులు ఈనెల 20లోపు చెల్లించాల్సిందిగా ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఈనెల 7న నోట్ ఆర్డర్ కూడా జారీ చేశారు. బార్ యాజమానుల నుంచి నిర్ణయిత లైసెన్సు ఫీజుకు ఈఏడాది 10శాతం అదనంగా వసూల్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాత విధానంలో మద్యం షాపులు రానున్నట్లు ఓ అంచనాకు వచ్చిన కడపలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ యాజమానులు అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న సీఎంఆర్ లాడ్జిలో ఇటీవల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రెన్యూవల్ లైసెన్సు ఫీజు చెల్లించుకుండా ప్రభుత్వానికే బురిడీ కొట్టే దిశగా బార్ యాజమానులు సిద్ధమయ్యారు.

అధికార అండతో..

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప నగరం నడిబొడ్డులో రెండు బార్‌లను, రింగ్ రోడ్డులో ఉన్న మరో బార్‌లో సగభాగాన్ని తెలుగుతమ్ముళ్ల స్వాధీనం చేసుకున్నారు. 30ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ వ్యాపారి నుంచి బలవంతంగా రెండు బార్‌లు సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఈ దుస్సంప్రదాయం కడప, గురజాల, చిలకలూరిపేటలో మాత్రమే తెరపైకి వచ్చింది. కాగా, బార్ యాజమాని మీ పేరుపై ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని, లైసెన్సు ఫీజు కూడా మీరే చెల్లించుకోవాలని నిబంధనలు పెట్టి తెలుగుతమ్ముళ్లకు అప్పగించారు. ఆ మేరకు ఈనెల 20న లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంది. కాగా, కడపలో మొత్తం 12బార్‌లున్నాయి. వారందర్నీ ప్రత్యేకంగా పిలిపించి భేటీ అయ్యారు. ప్రస్తుతం ఉన్న లైసెన్సు ఒక్కొక్క బార్‌కు రూ.1.70 కోట్లు నుంచి రూ.1.89కోట్లు చెల్లించారు. ఆ రేటుకు మరో 10శాతం అదనంగా చెల్లించాల్సి ఉంది. అంటే నగరంలోని 12 బార్లకు సరాసరి రూ.15కోట్లకు పైగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సదరు బార్ యజమానులు రెన్యూవల్ చేసుకోకూడదని మూకుమ్మడిగా ఓ నిర్ణయానికొచ్చారు.

అన్న చూసుకుంటాడు..

'అసలే ఇప్పుడు ఫీజు రేట్లు అధికంగా ఉన్నాయి. మళ్లీ 10 శాతం అదనంగా చెల్లించాలి. మనమంతా ఏకతాటిపైకి వచ్చి రెన్యువల్స్ చేయించుకోవద్దు, అలా చేయించుకోకపోతే, ఉన్న బార్లు రద్దు అవుతాయి. అందరం కొత్తగా దరఖాస్తు చేసుకుందాం.. ఎలాగూ అధికారంలో ఉండేది మనమే.. లైసెన్సు మనకే దక్కేలా ప్రణాళిక వేసుకుందాం. దీనికోసం తలా కొంత ఖర్చు పెట్టుకుంటే చాలు, తక్కువ రేట్లతో మన బార్లు మనకే దక్కేలా చూసుకుందా'మంటూ ఒప్పందానికి వచ్చారు. 'అన్నీ అన్నతో మాట్లాడుతాం, మీరంతా ఒకే అంటే మేమే మొత్తం వ్యవహారం నడుపుతా'మంటూ కొందరు తెలుగు తమ్ముళ్లు సమావేశంలో భరోసా ఇచ్చినట్లు సమాచారం. 'మళ్లీ భేటీ అవుదాం, అప్పటి వరకూ ఎవ్వరూ లైసెన్సు ఫీజు చెల్లించవద్దనే'ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా కొత్తగా దరఖాస్తు చేసుకుంటే ఒక్కో బార్‌కు రూ. 40 లక్షల వరకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బార్ యజమానులు సిండికేట్‌గా ఏర్పడ్డం వల్ల సుమారు సుమారు రూ.10కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడినట్లే.

కడపలో గోవా మద్యం

ప్రైవేటు మద్యం షాపుల్లో కల్తీలుంటాయని, ఎక్కువ మంది బార్లు వైపు అడుగులు వేస్తుంటారు. కడపలో కొన్ని బార్‌లలో గోవా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇదివరకూ ఎన్నడు లేనివిధంగా బయటి నుంచి తక్కువ ధరలకు మద్యం తెప్పించుకొని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కడప శివార్లల్లో ఉన్న ఓ బార్‌కు చెందిన వారి వద్ద 12కేసులు గోవా మద్యం లభ్యమైనట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ యంత్రాంగాన్ని మేనేజ్ చేసుకొని కేసులు లేకుండా జాగ్రత్త పడ్డట్లు సమాచారం. కొత్తగా బార్ నిర్వహణలో రంగప్రవేశం చేసిన వ్యక్తులు గోవా మద్యం విక్రయాల పట్ల దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మొత్తానికి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అటు లైసెన్సు ఫీజు చెల్లింపుల్లో ఎగనామం పెడుతున్నారు.. ఇటు బయటి మద్యం సరఫరాతో అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. తెలుగు తమ్ముళ్లా మజాకా.

గండికోటకు కృష్ణా జలాలు చేరిక



గండికోటకు చేరిన కృష్ణా జలాలు

కొండాపురం: అవుకు రిజర్వాయర్ వద్ద నుంచి జీఎస్ఎస్ఎస్ మెయిన్ కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీరు గండికోట జలాశయంలోకి ఆదివారం ఉదయం చేరినట్లు జీఎస్ఎస్ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు తాగు నీటి అవసరాల కోసం 45 టీఎంసీలు గండికోట జలాశయం ద్వారా ప్రాజెక్టులలో నిలువ చేస్తామన్నారు. గండికోట ప్రాజెక్టులో 25 టీఎంసీలు నిల్వచేసి ఈ ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయం వామికొండ రిజర్వాయర్లు సర్వరాయ సాగర్, పైడిపాలెం జలాశయం చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌లోనూ కృష్ణా జలాలు నిలువ చేస్తామన్నారు. గండికోట ప్రాజెక్టు ప్రస్తుతం రెండు టీఎంసీలు నీటిమట్టం ఉందన్నారు.

వెలిగల్లు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

గాలివీడు: వైఎస్ఆర్ వెలిగల్లు రిజర్వాయర్ నుంచి 66 క్యూసెక్కుల నీటిని కుడి కాల్వ ద్వారా విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈ సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 4.64 టీఎంసీల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో 2.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది.2 టీఎంసీలు నిల్వ ఉంచి మిగిలిన నీటిని రైతుల పంట పొలాలకు మూడు నెలల పాటు వదులుతున్నట్లు చెప్పారు. 2 టీఎంసీలను రిజర్వాయర్ లో తాగునీటి కోసం నిల్వ ఉంచామన్నారు.ప్రాజెక్టు నుంచి 27 కిలోమీటరు వద్ద నీరు ప్రవహిస్తోంది.

టీడీపీ నాయకుల దౌర్జన్యం



టీడీపీ నాయకులు దున్నిన పొలం

పెండ్లిమర్రి: టీడీపీ నాయకుల దౌర్జన్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. పెండ్లిమర్రి మండలం వెల్లటూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 202లో 4.66 ఎకరాల పట్టా భూమి ఉంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.జనార్దన్ రెడ్డి, రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డికి కలిపి 1.25 సెంట్ల భూమి ఉంది. టీడీపీ నాయకులు పి.భాస్కర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, శ్రీనువాసులురెడ్డి, తదితరులు ఓ ప్రైవేట్ సర్వేయర్‌తో కొలతలు వేయించి తమ భూమిని దౌర్జన్యంగా దున్నేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి మాది అని అడిగితే మమ్మలను భయబాంత్రులకు గురి చేస్తున్నారని జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గంగమ్మా..కాపాడవమ్మా..



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె: గంగమ్మ తల్లీ.. కరుణించి కాపాడవమ్మా అంటూ భక్తులు అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మను వేడుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు మొక్కులు ఉన్న వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు.

కమనీయం..రామయ్య పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

గరుడ వాహనంపై వైభవంగా నగరోత్సవం

వాల్మీకిపురం (అన్నమయ్య జిల్లా): టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభి రామాలయంలో ఆదివారం శ్రీరాముడికి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చన, అభిషేకం, తోమాలసేవ.. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవ ఘటాన్ని భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సీతారాములు గరుడ వాహనంపై నాలుగుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించిన భక్తులు పరవశించిపోయారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ.. బోధన తడబడి

- అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాని పాఠ్య పుస్తకాలు
- పట్టించుకోని ప్రభుత్వం
- ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు



చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ చిన్నారులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. అంగన్వాడీ కేంద్రాలు తెరిచి నెలలు గడుస్తున్నా పాఠ్య పుస్తకాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా పాత పుస్తకాలతోనే బోధనలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు ఆయా కేంద్రాలకు అందజేసేది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్-1, బర్డ్స్-2 కిట్లను అందించింది. వీటితోపాటు అంగన్వాడీల్లో ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ మాదిరిగా ఇంగ్లీషులో పాఠాలు బోధిస్తుంటే కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. బోధనలకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లీషు, గణితం, స్పోకెన్ ఇంగ్లీషు, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు అందజేసేవారు. నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందించేవారు. కానీ ఈ ప్రభుత్వంలో పాఠ్య పుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోయింది.

13	జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు
2389	అంగన్వాడీ కేంద్రాలు
56,159	మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు
1,20,514	మొత్తం విద్యార్థులు



పాత పుస్తకాలతోనే బోధనలు

జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, 2212 మెయిన్, 177 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరేళ్లలోపు 56,159 మంది చిన్నారులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు కావస్తున్నా అంగన్వాడీ కేంద్రాల వైపు దృష్టి సారించలేదు. అంగన్వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో వర్కర్లు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా ఇంకా పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందించలేదు. గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలను అందిచడంతోపాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ తీసుకుని అంగన్వాడీ కేంద్రాలకు తమ చిన్నారులను పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త పుస్తకాలను అందించకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



త్వరలో కొత్త పుస్తకాలు వస్తాయి



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఢోకా లేదు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న పాఠ్య పుస్తకాలు విద్యాబోధనకు సరిపోతోంది. త్వరలో కొత్త పుస్తకాలు వస్తాయి. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబోధన విధానాన్ని ప్రతిరోజు టైమ్ టేబుల్‌గా అన్ని కేంద్రాలకు పంపించాం. అంగన్వాడీ వర్కర్లు చిన్నారులకు పాఠాలు, ఆటల ద్వారా విద్యను బోధిస్తున్నారు.

- శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ,కడప

109 రకాల నూతన వంగడాలు విడుదల

కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య



మాట్లాడుతున్న కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎ. వీరయ్య

వైవీయూ: వాతావరణ మార్పులను తట్టుకుని, పోషకాలు జోడించిన, అత్యధిక దిగుబడులు ఇచ్చే 109 రకాల నూతన వంగడాలను భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ ఎ. వీరయ్య పేర్కొన్నారు. ఆదివారం కృషి విజ్ఞానకేంద్రంలో నూతన వంగడాల విడుదల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 క్షేత్రపంటలు, 27 ఉద్యానపంటలు మొత్తంగా 61 పంటలలో 109 రకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. పసుపు పంటలో కలుపు నివారణకు పిచికారీ చేసే మందుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త డా. ప్రశాంతి, సస్యరక్షణ శాస్త్రవేత్త డా.వి.శిల్పకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డా. ఎస్. మనాస, డా. టి. మహేష్‌బాబు, డా. ఐ. సురేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ



మైదుకూరు : మైదుకూరు డీఎస్పీగా నియమితులైన రాజేంద్రప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మైదుకూరు డీఎస్పీగా పనిచేస్తున్న టి.వెంకటేశులును స్థానిక ఎస్పీ కార్యాలయంలో నివేదిక చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ఇంటిలిజెన్స్ డీఎస్పీగా ఉన్న రాజేంద్ర ప్రసాద్‌ను మైదుకూరుకు బదిలీ చేసింది. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఎస్ఐగా వైఎస్సార్ జిల్లా, సీఐగా అన్నమయ్య జిల్లాలో పనిచేశారు.

మహిళ మృతి

– సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టణ సీఐ నరేష్‌బాబు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో దేవరింటి ఎరుకలమ్మ(60) అనే మహిళ ఆదివారం మృతి చెందారు. పట్టణ సీఐ నరేష్‌బాబు వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన దేవరింటి ఎరుకలమ్మ మృత దేహం కడప రోడ్డులోని దాబా పక్కన పొలంలో గుర్తించినట్లు తెలిపారు. మృతురాలి శరీరంపై ఆభరణాలు, బ్యాగులోని పర్సులో డబ్బులు ఉన్నాయని వివరించారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఎరుకలమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పులివెందుల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో మిసింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది.

వర్షానికి కూలిన గోడ



రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెకి చెందిన రైతు కె.శివశంకర్‌రెడ్డి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆదివారం గాలులతో కూడిన వర్షాలకు శివశంకర్‌రెడ్డి ఇంటి గోడ కూలిపోయింది. సుమారు రూ.60 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కుమార్తెను చూసేందుకు వెళ్తూ ప్రమాదంలో మృతి



మృతి చెందిన నరసింహులు

పెనగలూరు : మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన రాచూరి నరసింహులు(37) తన కుమార్తెను చూసేందుకు వెళ్తుండగా ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. నరసింహులు ఖతార్ దేశానికి వెళ్లి అక్కడ పనిచేసుకుంటూ వారం క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. మృతుడి భార్య గల్ఫ్ దేశంలోనే ఉంటుంది. నరసింహులు ఉదయాన్నే అందరితో ఆప్యాయంగ మాట్లాడారు. అనంతరం నెలూరు జిల్లా పెనబద్వేల్ గ్రామంలో అవ్వగారి ఇంటివద్ద ఉన్న కుమార్తెను చూసేందుకు చిన్న కుమారుడు రిషీతో కలిసి నరసింహులు బయలుదేరారు. ఓబులాయపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో స్కూటర్ ఢీకొంది. నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా చిన్న కుమారుడు రిషీకి గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు.

డ్రాగా ముగిసిన మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 335 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు చివరిరోజున 176.2 ఓవర్లలో 573 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో వరుణ్ సాత్విక్ 214, నిశ్చయ్ 65 పరుగులు చేశారు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 21 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 381 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 158.2 ఓవర్లలో 697 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పరమ్‌వీర్ సింగ్ 208 పరుగులు, కేపీఎస్.ప్రసాద్ 112 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ మహేష్ 7 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 31 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 331 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.



వరుణ్‌సాత్విక్ (214 పరుగులు)



పరమ్‌వీర్ సింగ్ (208 పరుగులు)



కేపీఎస్ ప్రసాద్ (112 పరుగులు)



భార్గవ్ మహేష్ (7 వికెట్లు)

శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 66 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 72 ఓవర్లలో 238 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హర్షవర్ధన్ 55, రక్షణ్ 48 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 42 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. జట్టులోని థామస్ రామ్‌కుమార్ 59 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు రేవంత్ నాగకుమార్ 3 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 231 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 243 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

యువకుడు ఆత్మహత్య



అమర్ తేజ (ఫైల్)

వాల్మీకిపురం : అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వాల్మీకిపురంలో చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి సమీపంలోని అమ్మినేనివీధికి చెందిన వెంకటరాజు కుమారుడు అమర్‌తేజ (29)కొంత కాలంగా శక్తికి మించి అప్పుచేశారు. అప్పుల ఒత్తిడికి తట్టుకోలేక మానసిక ఒత్తిడికి గురైన అతడు తీవ్ర మనస్తాపం చెందారు. శనివారం రాత్రి మదనపల్లి నుంచి వాల్మీకిపురం పట్టణ పొలిమేర్లకు చేరుకున్న అమర్‌తేజ ఆదివారం తిరుపతి నుంచి గుంతకల్‌కు వెళ్లే రైలు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో యువకుడి శరీరం గుర్తుపట్టలేని విధంగా ముక్కలుగా పడిపోయింది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా.. వారు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటకరంగానికి కీర్తినిచ్చిన 'పల్లేటి'

కడప కల్చరల్ : తెలుగు నాటక రంగానికి రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ అఖండమైన కీర్తి ఆర్జించి పెట్టారని సీనియర్ రంగస్థల కళాకారులు అన్నారు. కడప నగరంలోని రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్సార్ జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంస్మరణసభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నాటక రచయితగా పల్లేటి లక్ష్మీకులశేఖర్ ఎన్నో విజయాలు సాధించారని, ఆర్థికంగా బలపడకపోయినా కళాకారుడిగా సంతృప్తికర జీవితం గడిపారన్నారు. కోశాధికారి డాక్టర్ కాపోల్లు రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కులశేఖర్‌పై పరిశోధన చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ కడపలో చిన్న నాటక రచయితగా ప్రారంభమైన ఆయన జీవితం సినిమాల వరకు వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలోకల్లూరు బాల యల్లారెడ్డి, జి.సత్యరాజు, పి.నారాయణరెడ్డి, గంగయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మల్లికార్జునరెడ్డి, తదితరులు

లక్ష్మీ కులశేఖర్ మృతి బాధాకరం

ప్రఖ్యాత నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ ఇక లేరన్న వార్త తనను తీవ్రంగా కలిచి వేసిందని జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ అన్నారు. తెలుగు పద్య నాటకంలో ఆయన శైలి అజరామరమని, వ్యక్తిగతంగా ఆయన పలు నంది అవార్డులను సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవోదయ సాంస్కృతిక కళా మండలి అధ్యక్షుడు దాసరి సుధాకర్, హార్మోనిస్టు సుబ్బరాయుడు, జై భీమ్ మాల మహాసేన సంపత్‌కుమార్ పల్లేటి మృతి పట్ల తమ సంతాపం వ్యక్తం చేశారు.

వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని మంత్రికి వినతి



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇస్తున్న షరీఫ్

ప్రొద్దుటూరు : వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని ఆదివారం ప్రొద్దుటూరు పర్యటనకు వచ్చిన ఏపీ లా అండ్ మైనారిటీ వెల్ఫేర్ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్‌కు ఇన్సాఫ్ మాజీ జిల్లా కార్యదర్శి షరీఫ్ వినతిపత్రం అందించారు. షరీఫ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ భూములను ఆక్రమించారని ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. చాపాడు మండలం చియ్యపాడు, పెద్దగురువలూరు, చిన్న గురువలూరు, బూడిదపాడు, అల్లాడుపల్లె గ్రామాల్లో, ప్రొద్దుటూరు మండలం మోడంమీదపల్లె, కొత్తపల్లె, కామనూరు, కల్లూరు, ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి, చిలమకూరు తదితర గ్రామాల్లో వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని, ఆ భూముల్లో నిర్మించిన కట్టడాలను కూల్చి, ఆక్రమణదారులపై, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.మాలిక్, సయ్యద్ షరీఫ్, బాషా పాల్గొన్నారు.

బంగారుపేటలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ మధుసూదన్‌రావు

సిద్దవటం : మండలంలోని బంగారుపేట గ్రామంలోని రెండిళ్లలో ఆదివారం చోరీ జరిగింది. బంగారుపేటకు చెందిన గూండ్ల రామక్రిష్ణ, ఆయన సోదరుడు గూండ్ల వసంతరావు కుటుంబీకులు ఈ నెల 6న ఇళ్లకు తాళాలు వేసి బళ్లారికి వెళ్లారు. ఆదివారం వసంతరావు కుమారుడు శివసాయికుమార్ వచ్చి చూడగా.. ఇంట్లో దుస్తులు చెల్లా చెదురుగా కనిపించాయి. దీంతో తన ఇంట్లో రూ.40 వేల నగదు, జత కమ్మలు, ఉంగరం, రామక్రిష్ణ ఇంట్లో రూ.10వేల నగదు, రెండు జతల కమ్మలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటిమిట్ట సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ మధుసూదన్ రావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బూసిపాటి



మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : బద్వేల్ మండలం సి.కొత్తపల్లెలో దళిత మహిళలపై దాడి చేసిన టీడీపీ నేత రామచంద్రారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సి.కొత్తపల్లె పరిధిలోని రెండెకరాల ప్రభుత్వ భూమిలో దళితులు నివాసం ఉంటున్నారని.. టీడీపీ నేత రామచంద్రారెడ్డి అనుచరులతో వచ్చి మహిళలని చూడకుండా దాడి చేసి... మళ్లీ కౌంటర్ కేసు పెట్టడం దారుణమన్నారు. దళితులకు న్యాయం జరిగేంత వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ సి.కొత్తపల్లిలో ఊరు అనేదే లేదని, పేదలు గుడిసెలు వేసుకుని చాలాకాలంగా పట్టాలివ్వాలని అడుగుతున్నారన్నారు. రామచంద్రారెడ్డిపై కేసు నమోదు కాకుండా పక్షపాతం చూపిస్తున్నారని, టీడీపీ ప్రమేయంతోనే దాడులు జరుగుతున్నాయన్నారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. బాధ్యతారహితంగా మాట్లాడిన ఎస్ఐపైనా చర్యలు తీసుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సత్తార్, బీఎస్పీ నాయకులు గుర్రప్ప, సీఆర్పీ.ప్రసాద్, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

అలంకార చిత్రం పుస్తకావిష్కరణ



చిత్ర కవితా సౌరభం - అలంకార చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ప్రొద్దుటూరు : అలంకారాలపై వెంకటరమణరాజు చేసిన కృషి వెలకట్టలేనిదని హంస అవార్డు గ్రహీత, ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి అన్నారు. స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో చిత్ర సాహితీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అలంకారం వెంకటరమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం - అలంకార చిత్రం పుస్తకాన్ని విద్వాన్ బురుజు మునిస్వామి, చిత్రకవి పుల్లూరు మాతయ్య ఆదివారం ఆవిష్కరించారు. అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ అలంకారాలను ప్రయోగించడంలో మన ప్రాచీన కవులు అనేక చిత్ర విచిత్రమైన విన్యాసాలు చేశారన్నారు. పుస్తక సమీక్షకులు భూతపూరి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ వేల సంఖ్యలో పద్యాలను పరిశోధించి పుస్తకాన్ని రూపొందించారని తెలిపారు. అనంతరం వెంకటరమణరాజు, ఇందిర దంపతులను సంస్థ నిర్వాహకులు విజయకుమార్, ఆదిత్య కుమార్, వసంతకుమార్, వారి కుటుంబ సభ్యులు, సాహితీ వేత్తలు సత్కరించారు. బురుజు మునిస్వామి, చిత్రకవి పుల్లూరు మాతయ్యలకు చిత్ర సాహితీ పురస్కారం–2024 అందజేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి శీను, జింకా సుబ్రహ్మణ్యం, సాధు గోపాలకృష్ణ, కాశీవరపు వెంకట సుబ్బయ్య, పల్లా కృష్ణ, పల్లా రామారావు, మామిళ్ల లోకనాథం, మోహన్‌రెడ్డి, గుండా వెంకట సహదేవుడు, చంద్ర శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మృతి చెందిన వెంకటసుబ్బమ్మ

సిద్దవటం : మండలంలోని పాలకొండ్రాయునిపల్లె గ్రామానికి చెందిన ఎందుల కొండు వెంకటసుబ్బమ్మ(42) ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఎద్దుల కొండు వెంకటసుబ్బమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యా, భర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చాలాకాలంగా వెంకటసుబ్బమ్మ కడుపునొప్పితో బాధపడుతోంది. మాత్రలు మింగిన తగ్గకపోవడంతో మనస్తాపం చెందింది. ఆదివారం భర్త పొలం పనులకు వెళ్లగా.. వెంకటసుబ్బమ్మకు ఇంట్లో కొక్కీకి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం కొరకు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

దేవాదాయ భూముల ఆక్రమణపై ఫిర్యాదు



చదును చేసిన ఆలయ భూములు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని దేవాదాయ భూముల ఆక్రమణపై ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు మైదుకూరుకు చెందిన మాజీ సర్పంచ్ చొక్కం రమేష్ తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. మైదుకూరులోని ఎన్.మైదుకూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1845/1, 2, 3, 4, 5లోని 10.20 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి ఆక్రమణలపై గత ఏడాది సెప్టెంబరు 28న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌కు చొక్కం రమేష్ ఫిర్యాదు చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబర్‌లో లోకాయుక్త కేసు నమోదు చేసి దేవాదాయశాఖ కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. చొక్కం రమేష్ ఫిర్యాదుపై గత నవంబర్ 3న స్థానిక తహసీల్దారు విచారణ చేపట్టారు. అయితే ఆక్రమణకు గురైన భూములను ఆన్‌లైన్ చేయలేదు. ఇదిలా ఉంటే తాజాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు పిచ్చి మొక్కలను తొలగించి ఆ భూములను చదును చేశారు. ప్లాట్లు వేసి విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని చొక్కం రమేష్ మళ్లీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు

బి.కొత్తకోట : మైనర్ బాలికపై దాడి చేసి కొట్టారనే ఆరోపణలపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట బీసీ కాలనీ చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 7న ఇదే కాలనీకి చెందిన కొందరు బీరంగిరోడ్ ప్రాంతంలో వెళ్తున్నారు. ఆ సమయంలో అమ్మమ్మ ఇంటికి వెళ్తున్న 8వ తరగతి విద్యార్థిని ఆగి వారితో మాట్లాడుతోంది. ఇది చూసిన కొందరు యువకులు ఇక్కడ ఏం చేస్తున్నారంటూ మందలిస్తూ.. విద్యార్థిని, మరో యువకుడిపై దాడి చేసి గాయపరిచారు. తన కుమార్తెకు గాయాలవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే కేసుతో సంబంధంలేని తమ పిల్లలను అనవసరంగా ఇరికించారంటూ స్టేషన్ ఎదుట నలుగురి పిల్లల బంధువులు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన చిన్నక్క, అమీర్‌బాషా

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తంబళ్లపల్లె మండలం రెడ్డికోట గ్రామానికి చెందిన డి.చిన్నక్క(65) భర్త దశదిన కర్మల్లో భాగంగా ఆటోలో తలారివాండ్లపల్లెకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గ మధ్యంలో మరో వాహనం ఆటోను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో నివాసం ఉన్న ఆటో డ్రైవర్ ఎస్.అమీర్ బాషా(43) స్థానికంగా కొందరితో కలిసి ఆటోలో గండి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెద్దమండ్యం సమీపంలోని చెరువు కట్టపై ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అమీర్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనాల ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో యువకుడిపై దాడి



కడుపులో కత్తితో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నవాజ్

కలకడ : ప్రత్యర్థులు కత్తితో దాడిచేయగా.. గాయాలతో క్షతగాత్రుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సంఘటన ఆదివారం రాత్రి కలకడలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కలకడ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన నవాజ్ తన భార్యతో మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. కడప నుంచి వచ్చిన వారి బంధువులు మందలించే సమయంలో షాను తన వద్ద ఉన్న కత్తితో నవాజ్ కడుపులో పొడిచినట్లు తెలిపారు. ఆందోళన చెందిన నవాజ్ కడుపులో కత్తిని తీయలేక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. స్పందించిన ఎస్ఐతిరుపతి ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చిన్నమండెం : మండలంలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై దేవగుడిపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గంగులయ్య(52) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. లక్కిరెడ్డిపల్లి నుంచి గంగులయ్య, వారి బంధువులతో కలిసి పడమటికోన పరిధిలోని హరిజనవాడలో వివాహ లగ్నపత్రిక రాసుకునేందుకు వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆటోలో చిన్న మండెం నుంచి వస్తుండగా..టమోటా లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో గంగులయ్య మృతిచెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడడంతో రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులంతా రెడ్డివారిపల్లి గ్రామం హరిజనవాడకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. చిన్నమండెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో ఆదివారం జూదం ఆడుతుండగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,800 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలు, హిటాచీ పట్టివేత



పట్టుబడిన హిటాచీ యంత్రం, ఇసుక లారీలు

పెండ్లిమర్రి : మండలంలోని తువ్వపల్లె–అల్లిరెడ్డిపల్లె గ్రామాల మధ్య పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. మూడు ఇసుక లారీలు, హిటాచి మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పెండ్లిమర్రి స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ

– 46 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 10న సాయంత్రం రాజారెడ్డి వీధిలోని జయన్న ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు.. జయన్న కరెంట్ బిల్లు కట్టేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. వచ్చి చూసే సరికి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. ఇంట్లో నల్లపూసల దండ, 46 గ్రాముల గాజులు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఓంశాంతినగర్‌లో నివాసముంటున్న రాజ్ కుమార్ ఈ నెల 5న బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ నెల 8న ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగల గొట్టి బీరువాలో నల్లపూసల దండను దోచుకువెళ్లారు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్దుబాటుకు ముందే పదోన్నతులు చేపట్టాలి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ముందే పదోన్నతులు చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. రాయచోటి డైట్ కేంద్రంలో జరిగిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ప్లస్ టూ పాఠశాలలో తాత్కాలిక నియమకాల ద్వారా కాకుండా శాశ్వత ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్ పదోన్నతులు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్‌ను 62 సంవత్సరాలకు పెంచాలని, కస్తూర్బా గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నైట్ డ్యూటీ నుంచి తొలగించి మహిళా వార్డెన్లను నియమించాలన్నారు. రామాంజులు, శ్రీనివాసులు, మురళీ మోహన్‌రాజు, కులశేఖర్ రెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి, నాగరాజు నాయక్,పాల్గొన్నారు.

గోలీ గుడ్లు



పోషకాహారం పేరుతో గోలీ గుడ్లు సరఫరా చేసి చేతులు దులుపు కొంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు వాటిని చూసి ఇవేం గుడ్లు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• తక్కువ పరిమాణంతో గుడ్లు సరఫరా • చోద్యం చూస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రం పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో 74, బి.కొత్తకోటలో 72, ములకలచెరువు మండలంలో 75 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మొత్తం ఈ 221 కేంద్రాలకు కోడిగుడ్ల పంపిణీ కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, శిశువులకు సూచించిన పరిణామంలో కాకుండా గోలీ సైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు తక్కువ పరిణామంలో గుడ్లను సరఫరా చేయడం ఎంత వరకు సమంజసమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నిభంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రశ్నిస్తే ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని.. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు మిన్నకుండిపోతున్నారు.

మా దృష్టికి రాలేదు

అంగన్‌వాడీలకు సరఫరా చేసే కోడిగుడ్లు తక్కువ సైజులో వున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. కార్యకర్తలెవరూ ఈ విషయంపై ఫిర్యాదు చేయలేదు. తక్కువ పరిణామం ఉన్నా.. కుళ్లినా,వెనక్కు పంపాలని కార్యకర్తలకు సూచించాం. నిభంధనల ప్రకారం గుడ్లు సరఫరా అయ్యేలా చూస్తామన్నాం చర్యలు చేపడతాం. – భాగ్యమ్మ, సీడీపీవో